సాక్షి
వికారాబాద్
గురువారం । 12 । జనవరి । 2023



వామ్మో.. వానరం!
వానరాలు పంటల పొలాలను నాశనం చేస్తూ అక్కడ నుంచి గ్రామాలకు చేరి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. 8లో▸



పాలన భారం
కొడంగల్ మున్సిపాలిటీలో ఆస్తి పన్ను బకాయిలు పేరుకుపోవడంతో పాలన భారంగా మారింది. 8లో▸



విద్యార్థికి టెన్త్ కీలకం
విద్యార్థి జీవితంలో పదో తరగతి అత్యంత కీలకమైనదని ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. 9లో▸

న్యూస్‌రీల్

రైతుబంధును రుణాల కింద జమచేయొద్దు

జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోపాల్



మాట్లాడుతున్న గోపాల్

తాండూరు రూరల్: రైతుబంధు డబ్బులను రుణాల కింద జమ చేయవద్దని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి గోపాల్ బ్యాంకర్లకు సూచించారు. బుధవారం మండల పరిధిలోని సాయిపూర్‌లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో 2,44,672 మంది రైతులకు గాను రూ.300 కోట్ల 47 లక్షల 31వేలు రైతుబంధు నిధులకు గాను, ఇప్పటి వరకు రూ.146 కోట్లు విడుదల అయ్యాయని.. పండుగ తర్వాత మిగతా రైతులకు రైతుబంధు డబ్బులు వస్తాయన్నారు. జిల్లాలో 52,825 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారన్నారు. ఇందులో 21,610 ఎకరాల్లో పల్లి, 18,140 ఎకరాల్లో శనగలు, 1,238 ఎకరాల్లో కంది, 2,277 జొన్న, 2,915 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ రుద్రమూర్తి, ఏఓ రజితలు ఉన్నారు.

నవోదయకు 31లోపు దరఖాస్తు చేసుకోండి

అనంతగిరి: జవహర్ నవోదయ విద్యాలయాల్లో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు ఈనెల 31వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నవోదయ విద్యాలయ ప్రిన్సిపాల్ డానియెల్ రత్నకుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 29న ఉంటుందన్నారు. అభ్యర్థులు ఏ జిల్లాలో నివసిస్తున్నారో అదే జిల్లాలోని నవోదయ విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. 2022-23 విద్యా సంవత్సరంలో ప్రభుత్వం, ప్రభుత్వంచే గుర్తింపు పొందిన పాఠశాలలో 5వ తరగతి చదువుతూ ఉండాలన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు 75శాతం సీట్లు కేటాయించనున్నట్లు తెలిపారు.

సమష్టి కృషితోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్: మున్సిపల్ పరిధిలోని అన్ని వార్డుల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టి కృషి చేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని సమావేశం మందిరంలో మున్సిపల్ సాధారణ సమావేశాన్ని నిర్వహించారు. రెండో విడత కంటి వెలుగు కార్యక్రమంపై అవగాహన సదస్సు, మున్సిపల్‌లో చేపట్టిన అభివృద్ధి పనులపై చర్చించారు. సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలన్నారు. మున్సిపల్ పరిధిలోని ప్రధాన రోడ్డుపై ఉన్న డబ్బాల వార్షిక రుసుమును పెంచడానికి చర్చించారు. పరిపాలనకు సంబంధించి పలు అంశాలపై చర్చించారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ఉషారాణి, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు మధుయాదవ్, వెంకట్‌రెడ్డి, శంకర్‌నాయక్, రమేశ్, ప్రభాకర్‌గౌడ్, మున్సిపల్ సిబ్బంది క్రాంతి, భరత్, నాగరాజు పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి



డీఎస్పీ శేఖర్‌గౌడ్‌కు వినతి పత్రం అందిస్తున్న పబ్లిక్ వాయిస్ ఫోరం ప్రతినిధులు

తాండూరు: పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని తాండూరు పబ్లిక్ వాయిస్ ఫోరం ప్రతినిధులు కోరారు. బుధవారం సబ్ డివిజన్ కార్యాలయంలో పబ్లిక్ వాయిస్ ఫోరం ప్రతినిధులు ఎండీ జిలానీ, భానుపవార్, ప్రకాశ్, మల్లుయాదవ్‌లతో పాలు పలువురు సభ్యులు డీఎస్పీ శేఖర్‌గౌడ్‌ను కలిసి ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. పట్టణంలో రోజు రోజుకు రద్దీ పెరుగుతోందని అన్నారు. పట్టణంలో ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. గాంధీచౌక్ కూడలి, భద్రేశ్వర్ చౌక్ కూడలిలో ట్రాఫిక్ సమస్య అధికంగా ఉందన్నారు. వాహనాలను పార్కింగ్‌చేసేందుకు స్థలాలను గుర్తించాలన్నారు. డీఎస్పీ స్పందించి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానన్నారు. కార్యక్రమంలో రాముయాదవ్, వెంకటేశ్ తదితరులున్నారు.

రోడ్లకూ పట్టాలు!

- నిబంధనలు పాటించని రిజిస్ట్రేషన్ అధికారులు
- డబుల్ రిజిస్ట్రేషన్లతో భూ తగాదాలు



రోడ్డు స్థలంలో తవ్వుతున్న గుంత



స్థలాన్ని సర్వే చేస్తున్న టౌన్ ప్లానింగ్ సిబ్బంది

తాండూరు: రెవెన్యూ, సబ్ రిజిస్ట్రార్ అధికారుల ధన దాహంతో భూ తగాదాలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఒకే సర్వే నంబర్‌పై రెండు రిజిస్ట్రేషన్లు చేయడం, భూములకు హద్దులు గుర్తించకుండా కూర్చున్న చోటనే రిజిస్ట్రేషన్లు చేయడం వలన గజం భూమి కోసం ఘర్షణలు చోటుచేసుకుంటున్నాయి. ఈ గొడవల్లో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారు. తాండూరు పట్టణంలోని అంతర్గత రోడ్డుకు రిజిస్ట్రేషన్ పత్రాలు అందించడం వివాదాస్పదంగా మారింది.

విచారణ లేకుండానే..

పట్టణంలోని సాయిపూర్ ప్రాంతంలో అంతర్గత రోడ్డుకు రిజిస్ట్రేషన్ చేసి పట్టా అందించిన వైనం బయటపడింది. హైదరాబాద్ మార్గంలోని సర్వే నంబర్ 7లో గంగోత్రి స్కూల్ ఉంది. దీని వెనక భాగంలో ప్లాట్ నంబర్ 31నుంచి 34 వరకు స్కూల్‌కే చెందిన ప్లాట్లు ఉన్నాయి. వీటి ముందు నుంచి 33 ఫీట్ల రోడ్డును చూపిస్తూ రిజిస్ట్రేషన్లు జరిగాయి. సర్వేనంబర్ 7 లేఅవుట్‌లో 1 నుంచి 34 ప్లాట్‌తో ముగించారు. అయితే కొత్తగా లే అవుట్‌లో లేని 36/ఏ ప్లాట్‌ను సృష్టించి గంగోత్రి స్కూల్ వెనుకభాగంలో ఉన్న రోడ్డుకు చెందిన 75 చదరపు గజాల భూమిని సర్వే నంబర్ 7, 4 స్థలంగా పేర్కొంటూ ఒక చదరపు గజానికి రూ.4,100 చొప్పున నిర్ధారించి సమద్‌ఖాన్ పేరిట గతేడాది నవంబర్ 17న రిజిస్ట్రేషన్ చేశారు. ఈ సమయంలో కనీస ప్రాథమిక విచారణ చేయకుండా రోడ్డు స్థలానిన ఓ వ్యక్తి పేరిట పట్టా చేయడం వివాదాస్పదంగా మారింది.

ఆక్రమణపై ఫిర్యాదు

గంగోత్రి స్కూల్ ఎదుట రోడ్డు స్థలాన్ని ఆక్రమిస్తున్నారంటూ స్కూల్‌కు చెందిన భూమి పట్టాదారు ఇందూర్ రాములు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో టౌన్ ప్లానింగ్ సిబ్బంది చేరుకొని విచారణ చేశారు. రోడ్డు స్థలంలో ప్రహరీ నిర్మాణ పనులను ఆపేశారు. అనంతరం మున్సిపల్ ఆఫీసుకు చేరుకున్న రాములు భూమి పత్రాలను అధికారులకు సమర్పించారు. పాఠశాల గేట్ ఎదుట ఉన్న రోడ్డు స్థలంలో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారంటూ ఫిర్యాదు చేశారు. స్థానిక నేత అండదండలతో రెచ్చిపోతున్నారని ఆరోపించారు. మరోవైపు రోడ్డు స్థలాన్ని కొనుగోలు చేసిన నిస్సార్ అలీ సైతం తాను డబ్బులు పెట్టి కొనుగోలు చేశానంటు అధికారులకు రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించాడు. నిబంధనలు పక్కన పెట్టి సబ్ రిజిస్ట్రార్ చేసిన అక్రమ రిజిస్ట్రేషనే భూ తగాదాకు కారణమైందని ఆరోపించారు.

సర్వే నంబర్లలో స్థలాలు మాయం

అక్రమ రిజిస్ట్రేషన్లతో సర్వే నంబర్లు ఉన్న భూములు మాయమవుతున్నాయి. హైదరాబాద్ మార్గంలో దుర్గా గ్రాండర్ పక్కన ఉన్న 16 గుంటల విలువైన స్థలం వివాదాస్పదంగా మారింది. ఒకే భూమిపై రెండు సర్వే నంబర్లకు చెందిన పట్టాదారుల మధ్య గొడవ జరుగుతోంది. ఇరువర్గాల మధ్య జరుగుతున్న గొడవ రాజకీయంగా మారింది. మరోవైపు తాండూరు మండలం ఎల్మకన్నె రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 167 భూమిని డబుల్ పట్టాలు చేయడంతో ఇరువర్గాల మధ్య రెండు నెలలుగా గొడవలు జరుగుతున్నాయి.

మచ్చుకు కొన్ని వివాదాలు

- తాండూరు పట్టణంలోని సాయిపూర్, మల్‌రెడ్డిపల్లి రెవెన్యూ భూముల సరిహద్దుల మధ్య భూ వివాదం నెలకొంది. హైదరాబాద్ రోడ్డు మార్గంలో దాదాపు 16 గుంటల భూమి మల్‌రెడ్డి పల్లి రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 51లో ఉందని ఓ వర్గం, అదే భూమి సాయిపూర్ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 5కు చెందినదిగా మరో వర్గం భూమి కోసం ఘర్షణ పడుతున్నారు. అయితే హద్దులను గుర్తించాల్సిన రెవెన్యూ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదు.
- పాత తాండూరు ప్రాంతంలో ఉన్న సర్వే నంబర్ 197లో మహమ్మద్ ఖదీర్ పేరిట పట్టా ఉంది. ఆ భూమిని బాబుజానీ దానం పేరిట రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లుగా పత్రాలు ఇచ్చారు. ఉన్న ఎకరా భూమిని ఎలాంటి పత్రాలు లేకుండానే గతంలో ఉన్న తాండూరు సబ్ రిజిస్ట్రార్ జమీరోద్దిన్ దానం (హిబా) పేరిట రిజిస్ట్రేషన్ చేశారు. ఈ విషయం స్థానికంగా వివాదానికి దారితీసింది.
- తాండూరు మండలం ఎల్మకన్నె గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 167లో 3 ఎకరాల భూమి పాత రికార్డులలో ఉంది. రెవెన్యూ అధికారుల తప్పిదం వల్ల 13 ఎకరాల భూమిగా మారింది. సర్వే నంబర్ 167 భూమిలో కొంత భూమిని గతంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి కొనుగోలు చేశారు. ఆ భూమిపై మరొకరి పేరిట పట్టా పాస్ బుక్కులు అందించారు. దీంతో భూమి కోసం గొడవలు జరుగుతున్నాయి.

పనులు నిలిపేశాం



గంగోత్రి స్కూల్ వెనకభాగంలో ఉన్న రోడ్డుపై ప్రహరీ నిర్మిస్తున్నారని ఫిర్యాదు అందింది. టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపించి పనులు నిలిపేయించాం. ఇరువురి వద్ద ఉన్న రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించి, తదుపరి చర్యలు చేపడతాం.

– జీషాన్ మహమ్మద్, టీపీఎస్, తాండూరు మున్సిపల్

డ్రగ్స్‌ను తరిమేద్దాం

- మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దుదాం
- మంత్రి సబితారెడ్డి



మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మంత్రి తదితరులు

మీర్‌పేట: తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటోందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మాదక ద్రవ్యాల నిరోధక అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మీర్‌పేటలోని ఎస్‌వైఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సును రాచకొండ పోలీసు కమిషనర్ డీ.ఎస్.చౌహాన్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అలుపెరుగకుండా పనిచేస్తున్నది పోలీసు శాఖ మాత్రమేనని తెలిపారు. సామాజిక కార్యక్రమాల్లోనూ పోలీసులు తమ వంతు పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. కళాశాలలు, పాఠశాలల్లోకి మాదకద్రవ్యాలు చాపకింద నీరులా విస్తరిస్తున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. దీనిపై పోలీసు శాఖ కఠినంగా వ్యవహరిస్తూ నేరస్తులను ఎప్పటికప్పుడు పట్టుకుని జైలుకు పంపాలన్నారు. విద్యార్థులు, యువత డ్రగ్స్ బారిన పడకుండా చూడాల్సిన బాధ్యత పోలీసులతో పాటు సమాజంలోని ప్రతిఒక్కరిపైనా ఉందని తెలిపారు. డ్రగ్స్‌కు బానిసైతే జీవితం అంధకారమవుతుందని, విద్యార్థులు వీటికి దూరంగా ఉండాలని సూచించారు.

ప్రాణాల మీదకు వస్తుంది

రాచకొండ పోలీసు కమిషనర్ డీ.ఎస్.చౌహాన్ మాట్లాడుతూ.. మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత ప్రమాదకరమని, జాలీగా మొదలయ్యే ఈ వికృతానందం వ్యసనంగా మారి ప్రాణాల మీదకు తెస్తుందని హెచ్చరించారు.



తాండూరు: దుప్పట్లను పంపిణీ చేసిన కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ నాయకులు

సర్పంచ్‌ల నిధులనూ కాజేసిన సీఎం

- అయోమయంలో ప్రజాప్రతినిధులు
- మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

తాండూరు: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి అందిస్తున్న నిధులను బీఆర్‌ఎస్ ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం తాండూరు పట్టణంలో పేద కుటుంబాలకు, అనాథలకు బీజేపీ నాయకులతో కలిసి కొండావిశ్వేశ్వర్‌రెడ్డి దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకాల అమలులోనూ కేంద్రప్రభుత్వం వాటా ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వం 42 శాతం నిధులను అందిస్తోందన్నారు. మరోవైపు గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నేరుగా సర్పంచ్‌ల ఖాతాలలో నిధులను జమ చేస్తోందన్నారు. చివరికి ఆ నిధులనూ మళ్లించారన్నారు. దీంతో సర్పంచ్‌ల్లో అయోమయం నెలకొందన్నారు. పాఠశాల్లో విద్యార్థులకు భోజనం అందించడంలోనూ బీఆర్‌ఎస్ సర్కార్ విఫలమైందన్నారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌పై వ్యతిరేకత పెరుగుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి ఏ.చంద్రశేఖర్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మురళీకృష్ణగౌడ్, పార్టీ జిల్లా అధ్యక్షకార్యదర్శులు సదానందరెడ్డి, రమేశ్‌కుమార్, జిల్లా అధ్యక్షురాలు, మున్సిపల్ కౌన్సిలర్ సాహు శ్రీలత తదితరులున్నారు.

వేడినీటి వసతి కల్పించాలి

బషీరాబాద్: ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులు స్నానాలు చేయడానికి వేడినీటి వసతి కల్పించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ, ఎస్సీ, బీసీ వసతి గృహాల్లో విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేశారు. విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ.. హాస్టళ్లల్లో చలికి పిల్లలు గజగజ వణుకుతున్నారని అందుకే ప్రతీ ఏడాది దుప్పట్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు.

పార్టీ పటిష్టతకు నిరంతరం శ్రమిద్దాం

- డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రామ్మోహన్‌రెడ్డి

పరిగి: గ్రామాల్లోని కార్యకర్తలు పార్టీ పటిష్టతకు కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి సూచించారు. బుధవారం పట్టణ కేంద్రంలోని తన నివాసంలో పార్టీ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 26 నుంచి చేయిచేయి కలుపుదాం కాంగ్రెస్‌ను బతికించుకుందాం అనే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఇంటింటికీ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను తీసుకెళ్లాలని సూచించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వ్యతిరేక విధానాలను ఎండగట్టాలన్నారు. రాష్ట్రం ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పూర్తిగా విఫలమైందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే చేపట్టే పథకాలను వివరించాలన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి హన్మంతుముదిరాజ్, ఉపాధ్యక్షుడు లాల్‌కృష్ణ, మండల అధ్యక్షుడు పరశురాం రెడ్డి, పార్థసారధి తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు కాంగ్రెస్

కొడంగల్: గడప గడపకు కాంగ్రెస్ పార్టీని తీసుకెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని పార్టీ నాయకులు పిలుపు నిచ్చారు. బుధవారం పట్టణంలోని రేవంత్ నివాసంలో పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, గ్రామ కమిటీల అధ్యక్షులు, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్‌లు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేయాలన్నారు. ఈనెల 26న ప్రతి గ్రామంలో పార్టీ జెండాను ఆవిష్కరించాలన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నయీమ్, ఆసీఫ్‌ఖాన్, ఆనంద్‌రెడ్డి, సంజీవరెడ్డి, శంకర్‌నాయక్, దాము, తార్యానాయక్, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారుల అభ్యున్నతికి కృషి

- ఉన్నత స్థాయికి చేరుకోవడం గర్వకారణం
- జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి
- ఉత్తమ క్రీడాకారులకు అభినందన సభ



క్రీడాకారిణిని సత్కరిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి

అనంతగిరి: ఈ ప్రాంతానికి చెందిన క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడం ఎంతో గర్వకారణమని జెడ్పీ చైర్‌పర్సన్ సునీతారెడ్డి అన్నారు. బుధవారం వికారాబాద్ పట్టణంలోని కొండా బాలకృష్ణారెడ్డి ఫంక్షన్ హాలులో రాష్ట్ర లగోరి అసోసియేషన్, ది లైట్ ఫౌండేషన్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను అభినందించారు. అలాగే కోవిడ్‌లో ఉత్తమ సేవలు అందించిన వారియర్స్‌ను సన్మానించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సునీతారెడ్డి జ్యోతి ప్రజల్వన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. క్రీడలు శారీరక దారుఢ్యంతో పాటు క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందన్నారు. క్రీడాకారులను సన్మానించడం గొప్ప విషయమన్నారు. క్రీడాకారులకు తగిన ప్రోత్సాహం, గుర్తింపు ఇస్తే ఉన్నత స్థాయిలో రాణిస్తారన్నారు. అందుకు కోచ్, తల్లిదండ్రుల పాత్ర ఎంతైన ఉంటుదన్నారు. క్రీడాకారుల అభ్యున్నతికి తమ వంతు ప్రోత్సాహం ఎల్లవేళలా ఉంటుందన్నారు. కోవిడ్‌లో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ఎంతోమంది సేవలు అందించారన్నారు. వారి సేవలను ప్రజలు ఎప్పటికీ మరిచిపోరన్నారు. ఈ సందర్భంగా ఆమె నిర్వాహకులను అభినందించారు. ఈ సందర్భంగా 130మంది క్రీడాకారులు, 75 పీడీ, పీఈటీలు, 45మంది కరోనా వారియర్స్(ఉత్తమ సేవలు) అందించిన వారికి జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్. ఏ.చంద్రశేఖర్, మాజీ ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేశ్‌కుమార్, ఎంపీపీ చంద్రకళ, ది లైట్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ టి.ఆనంద్, లగోరి అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్, రాష్ట్ర బాధ్యులు రాఘవన్‌నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సదానందరెడ్డి, రాష్ట్ర నాయకులు శివరాజు, రమేశ్, పాండుగౌడ్, సిద్దార్థ విద్యాసంస్థల డైరెక్టర్ జయదేవ్, కౌన్సిలర్‌లు శ్రీదేవి, గాయత్రి పలువురు ప్రజాప్రతినిధులు, క్రీడాకారులు పాల్గొన్నారు.



బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

బోనమ్మకు బోనాలు

తాండూరు మండల పరిధిలోని గౌతాపూర్‌లో గ్రామ దేవత ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు బుధవారం బొనమ్మ, సవరమ్మ దేవతలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం డప్పువాయిధ్యాలతో మహిళలు బోనాలతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించుకున్నారు. మమ్మల్ని చల్లంగా చూడాలని వేడుకున్నారు. కార్యక్రమంలో గ్రామదేవత ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

– తాండూరు రూరల్

ప్రతిభకు పురస్కారం

కుల్కచర్ల: మండల పరిధిలోని ఇప్పాయిపల్లికి చెందిన ఎర్రం కేశవులు ఉత్తమ పురస్కారం పొందారు. విశ్వవిద్యాలయ స్థాయిలో 'ఒక కుటుంబం.. ఒక భవిష్యత్తు' అనే అంశంపై నిర్వహించిన ఉపన్యాస పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో గవర్నర్ తమిళిసై నుంచి ప్రశంసా పురస్కారాన్ని పొందారు. పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయంలో జర్నలిజం కోర్సులో ద్వితీయ సంవత్సరం చదువుతున్న కేశవులు రాష్ట్రస్థాయిలో రాణించి మొదటి స్థానంలో నిలవడం పట్ల విశ్వవిద్యాలయం అధ్యాపక బృందం, మండలవాసులు అభినందనలు వ్యక్తం చేశారు.



కేశవులును అభినందిస్తున్న గవర్నర్ తమిళిసై

క్లుప్తంగా

23న సీపీఎం ధర్నా

పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు శ్రీనివాస్



మాట్లాడుతున్న శ్రీనివాస్

తాండూరు: ఇల్లు లేని పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు, ఇంటి స్థలాలు ఉన్న వారికి రూ.5లక్షలు మంజూరు చేయాలంటూ సీపీఎం ఆధ్వర్యంలో ఈ నెల 23న ధర్నా నిర్వహించనున్నట్లు పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.శ్రీనివాస్ తెలిపారు. తాండూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ఈ ధర్నా ప్రజా సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి కృషి

టీఎస్ యూటీఎఫ్

జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ్యానాయక్



చీమల్‌దరిలో టీఎస్ యూటీఎఫ్ సభ్యుల ప్రచారం

మోమిన్‌పేట: టీఎస్ యూటీఎఫ్ అభ్యర్థి మల్లారెడ్డిని గెలిపిస్తే పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని.. ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తామని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి దేవ్యానాయక్ అన్నారు. బుధవారం ఆయన మండల పరిధిలోని చీమల్‌దరి, దేవరంపల్లి, ఏన్కతల, మోమిన్‌పేట బాలికల, బాలుర, ఉర్దూ మీడియం ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, కోల్కుంద, కేజీబీవీ పాఠశాలలో ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవ్యానాయక్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో టీఎస్ యూటీఎఫ్ సంఘం సభ్యులు కీలక పాత్ర పోషించారన్నారు. సమైక్యవాద సంఘం నుంచి విడిపోయి తెలంగాణ సాధనకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ స్థాపించి స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా శక్తి వంచన లేకుండ కృషి చేశామన్నారు. ఈ ప్రచారంలో మండల అధ్యక్ష, కార్యదర్శులు రెడ్యారాథోడ్, శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

బాలిక అదృశ్యం



మమత (ఫైల్)

పహాడీషరీఫ్: ఓ బాలిక అదృశ్యమైంది. ఈ సంఘటన పహాడీ షరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. రంగనాయకుల కాలనీకి చెందిన యాదయ్య, మంగమ్మ దంపతుల కూతురు మమత(17)ను ఇంటి వద్ద వదిలి ఈ నెల 9న సొంతూరు కడ్తాల్ మండలం రావిచెడ్ గ్రామానికి వెళ్లారు. అదేరోజు రాత్రి తిరిగి వచ్చి చూడగా మమత కనిపించలేదు. ఆమె ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకుండా పోయింది. తల్లి మంగమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆచూకీ తెలిసిన వారు 94906 17241 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

వామ్మో.. వానరం!

వనాలు వీడి జనావాసాల్లోకి వచ్చిన వానరాలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఇళ్లలోకి చొరబడి దాడులు చేస్తూ దొరికిన వస్తువులను ఎత్తుకెళ్తున్నాయి. చేతికి వచ్చిన పంటలను నాశనం చేస్తున్నాయి. దీంతో ప్రజలకు కంటిమీద కునుకు కరువైంది



కేరెళ్లి రైతువేదిక ఎదుట రోడ్డుపై సంచరిస్తున్న కోతులు

- వనాలను వీడిన వానరాలు
- మహిళలు, చిన్నారులపై దాడులు
- ఆందోళన చెందుతున్న ప్రజలు
- పట్టించుకోని పాలకులు

ధారూరు: వనాలను వీడిన వానరాలు పంటల పొలాలను నాశనం చేస్తూ అక్కడ నుంచి గ్రామాలకు చేరి ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. కోతుల బెడద నివారించాలని రైతులు, ప్రజలు, వ్యాపారులు కోరుతున్నా ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. మండల పరిధిలోని 35గ్రామాల్లో కోతుల బెడద తీవ్రంగా ఉందని పంటల్ని నాశనం చేయడంతో పాటు సమీప గ్రామాల్లో ఇళ్లల్లో దూరి దొరికిన వస్తువులు ఎత్తుకెళ్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలను భయపెడుతూ ఇళ్లలోని ఆహార పదార్థాలు, తినుబండారాలు ఎత్తుకెళ్తున్నాయన్నారు. మండలంలో ఎక్కువ మొత్తంలో అడవులు విస్తరించి ఉన్నా కోతులు వందల సంఖ్య నుంచి వేల సంఖ్యలోకి మారాయి. వీటిని కట్టడి చేయడంతో ఇబ్బందులు ఎక్కువగా అవుతున్నాయి. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులను భయపెడుతూ వారి టిఫిన్ బాక్స్‌లు ఎత్తుకెళ్తున్నాయని తల్లిదండ్రులు వాపోతున్నారు.

కొండముచ్చులకు భయపడని కోతులు

ఇళ్లలోకి దూరుతున్న కోతులు వాటిని భయపెట్టేందుకు యత్నిస్తే దాడులకు పాల్పడుతున్నాయని మహిళలు వాపోతున్నారు. ఇంటి పైకప్పులు పాడుచేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మహిళలను, చిన్నారులను, వృద్ధులపై దాడులు చేస్తున్నాయని పేర్కొంటున్నారు. కుక్కలకు, కొండముచ్చులు తీసుకువచ్చినా అవి జంకడం లేదన్నారు. తాండూర్–హైదరాబాద్ ప్రధాన రోడ్డుపై సంచరిస్తూ వాహనదారులను ఇబ్బంది పెడుతూ.. ప్రమాదాలకు కారణమవుతున్నాయని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని కోతులను పారదోలే చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

ప్రజారోగ్యమే ప్రభుత్వ ధ్యేయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

నవాబుపేట: ప్రజారోగ్యం కాపాడడమే ప్రభుత్వ ధ్యేయమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం కంటి వెలుగు కార్యక్రమంపై ప్రజాప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ నెల 18 నుంచి నిర్వహించే కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అంతకు ముందు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భవాని, జెడ్పీటీసీ జయమ్మ, ఏఎంసీ చైర్మన్ ప్రశాంత్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ రాంరెడ్డి, ఎంపీడీఓ సుమిత్రమ్మ, వైద్యులు జగదీశ్, రఫికాబేగం, సర్పంచులు వెంకట్‌రెడ్డి, బల్వంత్‌రెడ్డి, ఎండీ రఫీ, పర్మయ్య, నర్సింహారెడ్డి, విమలమ్మ, బాలమణి, పద్మ, విజయలక్ష్మి తదితరులున్నారు.

పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం

మండల పర్యటనలో భాగంగా విచ్చేసిన ఎమ్మెల్యేకు ప్రజాప్రతినిధులు పలు ఫిర్యాదు చేశారు. మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయని.. గంజాయిలాంటి మత్తు పదార్థాలు విక్రయిస్తున్నారని ఫిర్యాదు చేశారు. స్పందించిన ఎమ్మెల్యే ఎస్‌ఐ భరత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కి తరలించామని ఎస్‌ఐ ఎమ్మెల్యేకు వివరించారు.

బీఆర్‌ఎస్‌తోనే పేదల ఉన్నతి

పరిగి ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కుల్కచర్ల: బీఆర్‌ఎస్‌తోనే పేదల అభ్యున్నతి సాధ్యమని పరిగి ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో గోరిగడ్డ తండా, కుస్మసముద్రం గ్రామాలకు చెందిన పలువురు కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనను చూసి కార్యకర్తలు, ప్రజలు బీఆర్‌ఎస్‌లో స్వచ్ఛందంగా చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరిరాంరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ హరికృష్ణ, నాయకులు అంగూర్ తదితరులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

ప్రభుత్వ పథకాలు పేదలకు వరంగా మారాయని ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో 30మంది లబ్ధిదారులకు



కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అర్హులంతా ప్రభుత్వ పథకాలను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు రాందాస్ నాయక్, తహసీల్దార్ రమేశ్‌కుమార్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శేరి రాంరెడ్డి, రైతు బంధు మండల అధ్యక్షుడు రాజు తదితరులు పాల్గొన్నారు.

పన్నులు చెల్లించక పాలన భారం

- మున్సిపాలిటీ పరిధిలో రూ.64లక్షల ఆస్తిపన్ను బకాయి
- ప్రభుత్వ శాఖల నుంచే రూ.10లక్షలు

కొడంగల్: మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో కలిపి రూ.64లక్షలు ఆస్తి పన్ను బకాయి ఉంది. ఇందులో ప్రభుత్వ శాఖల్లోనే రూ.10లక్షలకు పైగా ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆయా శాఖల అధికారులు పన్నులను చెల్లించకపోవడంతో మున్సిపల్ పాలన భారమవుతోందని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వెల్లడించారు. మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి, కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి సహకారంతో పన్నుల వసూలుకు మున్సిపల్ సిబ్బంది కృషి చేస్తున్నారు. గతంలో కొడంగల్ పంచాయతీగా ఉన్నప్పుడు పన్నులు నామమాత్రంగా ఉండేవి. ప్రస్తుతం మున్సిపాలిటీగా మారిన తర్వాత పన్నుల భారం పెరిగింది. వందల్లో ఉన్న పన్ను వేలల్లోకి మారింది. గతంలో ఏడాదికి ఒకసారి పన్ను వసూలు చేసేవారు. ఇప్పుడు ఆరు నెలలకు ఒకసారి ఆస్తి పన్ను చెల్లించాల్సి వస్తోంది. మున్సిపాలిటీల్లో ఆస్తిపన్ను ముందస్తుగా చెల్లించే వారికి ప్రభుత్వం నుంచి రాయితీ వస్తుంది. మున్సిపల్‌లోని నివాస గృహాలు వాణిజ్య సముదాయ భవనాల నుంచి ఇప్పటి వరకు 43శాతం పన్ను వసూలు చేశారు. మున్సిపల్ పరిధిలో సుమారు 4వేలకు పైగా ఇండ్లు ఉన్నాయి. వీటిల్లో కొంత మంది యజమానులు సకాలంలో పన్నులు చెల్లిస్తున్నా.. మరి కొంతమంది బకాయి చెల్లించకుండా పెండింగ్‌లో పెట్టారు. దీంతో సుమారు రూ.64 లక్షల పాత బకాయి పేరుకుపోయింది. అయితే కొడంగల్‌లో ఉన్న 48 ప్రభుత్వ శాఖల నుంచి సుమారు రూ.10లక్షలు మొండి బకాయిలను వసూలు చేయాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.



కొడంగల్ మున్సిపల్ కార్యాలయం

ఇంటి నుంచే పన్ను చెల్లింపు

ఇంటి పన్ను చెల్లింపు డిజిటల్ లావాదేవీలతో సులభమైంది. డెబిట్, క్రెడిట్ కార్డులు, ఇంటర్‌నెట్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్, యూపీఐ, గూగుల్ పే, ఫోన్ పే ద్వారా నేరుగా ఆయా మున్సిపాలిటీల ఖాతాలోకి డబ్బులు జమ చేయవచ్చు. క్యూర్‌కోడ్‌ను స్కాన్ చేసి తమ ఇంటి ఆస్తి పన్నును చెల్లించవచ్చు. ఇందుకు మున్సిపల్ శాఖ ప్రత్యేక క్యూఆర్ కోడ్ రూపొందించింది. కోడ్‌ను స్కాన్ చేసిన తర్వాత జిల్లా పేరు వస్తుంది. ఆ తర్వాత మున్సిపాలిటీ ఎంపిక చేసుకుని ఇంటి నంబర్ టైప్ చేస్తే ఆస్తి పన్ను ఎంత కట్టాలనేది చూపిస్తుంది. ఆ తర్వాత డబ్బులు చెల్లించాల్సి ఉంటుంది. మున్సిపల్‌లో పేరుకుపోయిన ప్రభుత్వ శాఖల పాత బకాయిలను వసూలు చేయడానికి కృషి చేస్తున్నట్లు కమిషనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయా శాఖల అధికారులు చొరవ తీసుకొని పన్నులు చెల్లించే విధంగా కృషి చేయాలి.

పీఎం కిసాన్‌కు ఈ-కేవైసీ తప్పనిసరి

ఏడీఏ వినోద్‌కుమార్

బంట్వారం: రైతులు పీఎం కిసాన్‌కు సంబంధించి తప్పని సరిగా ఈ-కేవైసీ చేయించుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీఏ వినోద్‌కుమార్ చెప్పారు. బుధవారం ఆయన బంట్వారం మండల పరిదిలోని బొప్పునారంలో ఫీల్డ్ విజిట్ చేశారు. యాసంగి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. సంక్రాంతి లోపు ఈ కేవైసీ చేయించుకున్న రైతులకు మాత్రమే పీఎం కిసాన్ డబ్బులు అకౌంట్లలో జమ అవుతాయని చెప్పారు. మండల పరిధిలో ఇప్పటి వరకు 640 మంది రైతులు ఇంకా ఈకేవైసీ చేయించలేదన్నారు. సీఎస్‌సీ సెంటర్లు, మీసేవా కేంద్రాలు, ఏఈఓ వద్ద ఈ కేవైసీ చేయించుకోవాలని సూచించారు. పంటల సాగుకు సంబంధించి సలహాలు, సూచనలకు రైతులు వ్యవసాయ అధికారులను సంప్రదించాలన్నారు. వారంలో రెండు రోజులు తప్పని సరిగా ఫీల్డ్ విజిట్ చేస్తామన్నారు. కమిషనరేట్ నుంచి వచ్చే సర్వే నెంబర్ల ఆధారంగా పంటల నమోదు చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఓ సంధ్య, ఏఈఓలు అశ్విని, మచ్చేందర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఏ వినోద్‌కుమార్

పిల్లలను చూసుకునే అవకాశం కల్పించండి

జిల్లా న్యాయసేవా అధికార సంస్థ కార్యదర్శి డీజీ.శీతల్

అనంతగిరి: మానవతా దృక్పథంతో తల్లిదండ్రులకు వారి పిల్లలను చూసుకునే అవకాశం కల్పించాలని జిల్లా న్యాయసేవా అధికార సంస్థ జిల్లా చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి కె.సుదర్శన్, కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి డీబీ.శీతల్ అన్నారు. హైదరాబాద్‌లోని శిశువిహార్‌లో తాండూరు మండలం పగిడ్యాలకు చెందిన నర్సమ్మ–ఎల్లప్ప దంపతులు వారి పిల్లలను చూసుకునేందుకు ఐదు రోజులుగా పడిగాపులు కాస్తున్నారు. వారికి పిల్లలను చూసుకునే అవకాశం కల్పించాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎంజీ.ప్రియదర్శిని ఆదేశించారు. సీడబ్ల్యూసీ చైర్మన్ శైలజకు తల్లిదండ్రులు పిల్లలను ఎప్పుడైనా చూసుకునే అవకాశం కల్పించాలని జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ద్వారా ఆదేశించారు.

నంబర్ ప్లేట్ లేని వాహనాలు సీజ్

మోమిన్‌పేట: నంబరు ప్లేట్ లేని వాహనాలను సీజ్ చేస్తామని సీఐ వెంకటేశం హెచ్చరించారు. బుధవారం సాయంత్రం వాహనాల తనిఖీలో భాగంగా 38వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వాహనాలు నంబర్ ప్లేట్ లేకుండా రోడ్డుపైకి తీసుకురావద్దన్నారు. దేవరంపల్లి బస్టాండ్ వద్ద దుకాణదారులు సీసీ కెమెరాలు తప్పక ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిబంధనలు పాటించని వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్‌ప్రకాశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బాల్య వివాహాలు నేరం

తహసీల్దార్ వెంకటస్వామి

బషీరాబాద్: బాల్య వివాహాలు చేస్తే ప్రభుత్వం అందజేసే కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లాంటి ప్రభుత్వ పథకాలకు అర్హత ఉండదని బషీరాబాద్ తహసీల్దార్ వెంకటస్వామి తెలిపారు. బాల్యవివాహాలు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన చైల్డ్ అడ్వైజరీ బోర్డు సమావేశంలో బాలల హక్కులపై సమీక్షించారు. ఈ సంతర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. ఫిబ్రవరి నుంచి పెళ్లిళ్ల సీజన్ అవ్వడంతో ఎక్కడ బాల్యవివాహాలు జరగకుండా ప్రతీ ఒక్కరు సామాజిక బాధ్యతగా అడ్డుకోవాలని లేదంటే 1098కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. బడీడు పిల్లలను పాఠశాలలకు పంపించాలన్నారు. ఆడ, మగ తారతమ్యం తల్లిదండ్రులు ఆడపిల్లలను ఉన్నత చదువులు చదివించాలన్నారు. చైల్డ్‌లైన్ డివిజన్ కోఆర్డినేటర్ వెంకటేశ్ మాట్లాడుతూ.. మహిళలను, బాలికలను వేధిస్తే 1098 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. నెల రోజుల వ్యవధిలో బాలల హక్కులకు సంబంధించి మండల పరిధిలో 42కేసులు నమోదయ్యాయని చెప్పారు. ఎక్కడైన చిన్నారులు ఆపదలో ఉన్నా, పిల్లలు తప్పిపోయిన కాల్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. అక్రమ దత్తత నేరమన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీడీఓ రమేశ్, ఎంఈఓ సుధాకర్‌రెడ్డి, ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి, ఏపీఎం పద్మారావు, పీహెచ్‌సీ వైద్యులు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పంచాయతీ కార్యదర్శుల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకటస్వామి

పార్కింగ్ చేసిన లారీల నుంచి డీజిల్ చోరీ

డ్రైవర్లను తల్వార్లతో బెదిరించి దుండగుల పరార్

కొత్తూరు: జాతీయ రహదారిపై నిరంతరం పోలీసుల నిఘా... ఓ వైపు హైవే పెట్రోలింగ్. మరో వైపు పోలీసుల బందోబస్తు .. అయినప్పటికీ కొందరు దుండగులు రోడ్డు పక్కనే నిలిపిన వాహనాల్లో నుంచి డీజిల్, డ్రైవర్లను బెదిరించి నగదు దోచుకెళ్తున్నారు. తాజాగా బుధవారం తెల్లవారు జామున దుండగులు రెండు లారీలనుంచి 400లీటర్ల డీజిల్ దొంగిలించారు. ఈ ఘటన కొత్తూరు పీఎస్‌కు కూతవేటు దూరంలో జాతీయ రహదారి జేపీదర్గా కూడలి వద్ద చోటు చేసుకుంది. డ్రైవర్ కమలాకర్ బింద్వే తెలిపిన ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన రెండు లారీలు గుజరాత్ నుంచి ప్లాస్టిక్ ముడిసరుకుతో చెన్నైకు వెళ్తున్నాయి. ఈ క్రమంలో ఉదయం 4.30గంటల ప్రాంతంలో ఇద్దరు డ్రైవర్లు జేపీదర్గా కూడలి సమీపంలో రోడ్డు పక్కనే వాహనాలను నిలిపి లారీ క్యాబిన్‌లో నిద్రకు ఉపక్రమించారు. కాసేపటికే లారీల వెనుకభాగంలో శబ్దం రావడంతో కిందకి దిగి పరిశీలించారు. అప్పటికే రెండు లారీల నుంచి సుమారు 400 లీటర్ల డిజిల్‌ను దొంగలించి చిన్న ట్రాలీలో నింపుకున్నారు. ఈ క్రమంలో దొంగలను అడ్డుకోబోయిన డ్రైవర్లను తల్వార్లతో బెదిరించి అక్కడ నుంచి పరారయ్యారు. వెంటనే లారీ డ్రైవర్లు స్థానికుల సాయంతో కొత్తూరు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఘటనపై ఫిర్యాదు చేశారు.



దుండగులు ధ్వంసం చేసిన డీజిల్ ట్యాంకు

సంక్రాంతికి ఊరెళ్తున్నారా..?

- ప్రజలు అప్రమత్తంగా ఉండండి
- ఎస్పీ కోటిరెడ్డి

అనంతగిరి: సంక్రాంతి సందర్భంగా గ్రామాలకు, పట్టణాలకు, ప్రయాణాలు చేస్తున్న నేపథ్యంలో. ఇదే అదునుగా దొంగలు చేతివాటం ప్రదర్శిస్తారు. ఊర్లకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండాలని, ముందస్తుగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ కోటిరెడ్డి ప్రజలకు సూచించారు. సంక్రాంతి పండుగ దృష్ట్యా చోరీలు నియంత్రించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ పలు సూచనలు చేశారు.

- ఇంట్లో బంగారు నగలు, నగదు బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఎక్కువ రోజులు వెళ్లేవారు విలువైన వస్తువులను వెంట తీసుకెళ్లాలి.
- ఊరు వెళ్తున్నపుడు పక్కింటి వారికి ఇంటి పరిసరాలను గమనించండని చెప్పాలి.
- విలువైన వస్తువులను స్కూటర్ డిక్కీల్లో, కార్లలో పెట్టకూడదు.



- ద్విచక్ర వాహనాలు, కార్లను ఇంటి ఆవరణలోనే పార్కింగ్ చేయాలి.
- బీరువా తాళాలను ఇంట్లో ఉంచరాదన్నారు. తమతో పాటే తీసుకెళ్లాలి.
- ఇంట్లో ఏదో ఒక గదిలో లైటు వేసి ఉంచాలి..
- విలువైన వస్తువుల సమాచారాన్ని, వ్యక్తిగత ఆర్థిక విషయాలను ఇతరులకు చెప్పకూడదు.
- ఆరుబయట వాహనాలకు హ్యాండిల్ లాక్‌తో పాటు వీల్‌లాక్ వేయాలి.
- ఇంటి తలుపులకు సెంట్రల్ లాకింగ్ సిస్టంను ఏర్పాటు చేసుకుని, వాచ్‌మెన్ లేదా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం మంచిది.
- ఇంటి నుంచి బయలుదేరే ముందు గ్యాస్ లివర్ తప్పనిసరిగా ఆఫ్ చేయడం, షార్ట్ సర్క్యూట్ కాకుండా జాగ్రత్తలు పాటించాలి.
- అనుమానస్పదంగా తిరిగే కొత్త వ్యక్తుల కదలికలు గమనిస్తే 100కు డయల్ చేసి సమాచారం ఇవ్వాలి.

జాతీయ సైన్స్‌ఫెయిర్‌కు ఐదు ప్రదర్శనలు



జాతీయ స్థాయి ఫెయిర్‌లో పాల్గొనున్న విద్యార్థులు



జాతీయ స్థాయికి ఎంపికైన బషీరాబాద్ విద్యార్థిని పూజ

సత్తా చాటిన జిల్లా విద్యార్థులు

అనంతగిరి: నిర్మల్ జిల్లాలో ఈ నెల 9 నుంచి 11వరకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి సైన్స్‌ఫెయిర్‌లో జిల్లా విద్యార్థులు సత్తాచాటారు. జిల్లా పరిధి నుంచి ఐదు ప్రదర్శనలు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి. రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ విభాగంలో ఐదు ప్రదర్శనలు పాల్గొనగా అందులో రెండు.. సైన్స్‌ఫెయిర్ విభాగంలో ఏడు ప్రదర్శనలు ఇవ్వగా అందులో రెండు జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి. వీటితో పాటు టీచర్ టీఎల్ఎం విభాగంలో జిల్లా నుంచి పాల్గొన్న ఒక ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపికైందని డీఈఓ రేణుకాదేవి, జిల్లా సైన్స్ అధికారి ఎస్.విశ్వేశ్వర్ తెలిపారు.

ఇన్‌స్పైర్ విభాగంలో..

- బషీరాబాద్ మండలం కేజీబీవీకి చెందిన విద్యార్థిని కె.పూజ ప్రదర్శించిన ఆటోమెటిక్ వెజిటేబుల్ కట్టర్ ప్రదర్శన
- మర్పల్లి మండలం కొంషెట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని ఈ.స్వాతి లైఫ్ సేవర్ వైపర్ ప్రదర్శన జాతీయ స్థాయికి ఎంపికయ్యాయి.

సైన్స్‌ఫెయిర్ విభాగంలో..

- మరికల్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన విద్యార్థి కె.రాంచరణ్ నీరు ఇంధనంగా మార్చే ప్రదర్శన
- తాండూరు అక్షర హైస్కూల్‌కు చెందిన విద్యార్థి పి.సందీప్ మొబైల్ మైక్రోస్కోప్ ప్రదర్శన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాయి.
- టీచర్ టీఎల్ఎం విభాగంలో కోట్‌పల్లి కేజీబీవీకు చెందిన టీచర్ అనూష ప్రదర్శన జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయింది.

అనారోగ్యమా.. ఆర్థిక ఇబ్బందులా..?

మిస్టరీగానే వృద్ధ దంపతుల మృతి

అబ్దుల్లాపూర్‌మెట్: వృద్ధ దంపతుల మృతి మిస్టరీగానే మిగిలింది. మహబూబ్‌నగర్ జిల్లా ధన్వాడ మండలం, కిష్టాపూర్ గ్రామానికి చెందిన నాగారం హనుమంతు (65), భార్య వెంకటమ్మ (50) మృతి చెందిన విషయం విదితమే. వీరు సోమవారం రాత్రి ఆహారంలో విషం కలుపుకుని తిన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే పోస్ట్‌మార్టంలో ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో వారు తీసుకున్న ఆహారాన్ని పరీక్షల నిమిత్తం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపించినట్లు పోలీసులు తెలిపారు. వృద్ధ దంపతులిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో వారికి అనారోగ్య సమస్యలున్నాయా..? లేదా ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయా..? అనే కోణంలోనూ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా వృద్ధాప్యంలో కన్నవారికి భారం కాకూడనే వృద్ధులిద్దరూ కలిసి ఆత్మహత్యకు పాల్పడి ఉంటారని పలువురు భావిస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా.. పోలీసుల దర్యాప్తు అనంతరం మృతికి గల కారణాలు బయటపడే అవకాశాలున్నాయి.



వెంకటమ్మ, హనుమంతు దంపతులు(ఫైల్)